మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

‘అనంత’కు రూ.251.2 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఖరీఫ్ - 2023లో వర్షాభావ పరిస్థితుల కారణంగా 1,79,815 హెక్టార్లలో పంట నష్టపోయిన 1,69,970 మంది రైతులకు రూ.251.2 కోట్ల ఇన్పుట్ సబ్సిడీ మంజూరైందని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పకతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు గరిష్టంగా రెండు హెక్టార్ల వరకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఇవ్వడం జరుగుతోందన్నారు. ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పెట్టుబడి రాయితీ విడుదల చేస్తోందని చెప్పారు. జిల్లాలో జూన్ నుంచి అక్టోబర్ మాసాలలో (ఖరీఫ్-2023) వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోవడం జరిగిందని, కేంద్ర మార్గదర్శకాలు అనుసరించి వర్షపాతం, పంట విస్తీర్ణం, ఉపగ్రహ ఆధారిత పంటల పరిస్థితి, జల ప్రవాహం, భూగర్భ జలాలు మరియు జలాశయాల స్థాయిల ఆధారంగా జిల్లాలో 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన అన్ని రకాల పంటలను పరిశీలించి పంట నష్టం అంచనా వేసి ఒక రైతుకు గరిష్టంగా 2 హెక్టార్ల వరకు నష్టపరిహారాన్ని నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపామని అందులో భాగంగా పంట నష్టపోయిన రైతులకు భరోసా కల్పిస్తూ ఇన్పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం విడుదల చేశారన్నారు. ప్రభుత్వం అందించిన ఇన్పుట్ సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు రూ.251.2 కోట్ల మెగా చెక్ ను జిల్లా కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, సలహా మండలి సభ్యులు వన్నూరమ్మ, సుబ్బారెడ్డి, కాంతారెడ్డి, పెద్దిరెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అతిథి పక్షులకు కరువు స్వాగతం

నీరు లేక ఎండిన వెంకటాపురం చెరువు

అడుగంటిన వీరాపురం, వెంకటాపురం చెరువులు
కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
కనుమరుగవుతున్న పర్యాటక కేంద్రం ఆనవాళ్లు

ఆ పక్షుల కిలకిల రావాలు ఆకలి కేకలు కానున్నాయి.! గతంలో సైబీరియన్ పక్షులతో కళకళలాడే చెట్లపై ఆకలి తీరక వాటి గూళ్లలోనే కబేళాలతో వేలాడుతున్న పక్షి ఆకారాలు కంటికి కనపడతాయోమోనని గ్రామస్తులు కలవరపడుతున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఇక్కడికి వచ్చే విదేశీపక్షులు ఇక్కడే ఉండి మే, జూన్ నెలల్లో గుడ్లు పెట్టి, పిల్లలకు జన్మనిస్తాయి. దాదాపు ఏడెనిమిది నెలల పాటు ఇక్కడే ఉండే ఈ అతిథి పక్షులు వచ్చాయన్న సంతోషం కన్నా అవి ఈ కరువు కాలంలో పడే కష్టాలను ముందుగానే ఊహించుకుంటున్న వీరాపురం, వెంకటాపురం గ్రామాలు చింతలోపడ్డాయి.

ప్రజాశక్తి - చిలమత్తూరు

గత మూడేళ్లుగా కుండపోత వర్షాలతో చెరువులు పొంగిపొర్లాయి. చెట్లు పచ్చదనపు సోయగాలతో దర్శనం ఇచ్చాయి. ఆ మూడేళ్లల్లో పక్షుల రాక అధికంగా పెరిగిపోయింది. అయితే ఈ ఏడాది వర్షపాతం ఏ మాత్రం లేకపోవడంతో చెట్లు ఎండుముఖం పట్టాయి. చెరువులలో నీరు అడుగంటాయి. ఈసారి ఈ విదేశీపక్షులు అధికంగా వచ్చినా వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

కనీస సౌకర్యాలు కరువు

పర్యాటక కేంద్రాలలో ఒకటైన వీరాపురం పక్షుల కేంద్రం. ప్రభుత్వాలు కనీస నిధులు కేటాయించకపోవడం కనీస సౌకర్యాలు కల్పించకపోవడం కారణంగా ఈ పర్యాటకకేంద్రం రోజు రోజుకు కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. పర్యాటక శాఖ గాని, అటవీశాఖ గాని పట్టించుకున్న పాపానికి పోలేదు. ఇక ఈ పక్షులకి ఏ మాత్రం రక్షణ లేదు. పక్షులు అధికంగా వస్తున్నప్పటికీ వాటి కోసం చెరువులలో నీటిని నింపడం గాని వాటిలో చేపలు పెంపకం చేపట్టి ఆహారాన్ని అందించడం వంటి కార్యక్రమాలు గాని ఏ మాత్రం చేపట్టడం లేదు. మండలం మీదుగా హంద్రీనీవా కాలువ పోతున్న కనీసం ఈ పంచాయతీ చెరువులకు కూడా నీటిని అందించలేని దుస్థితి నెలకొంది. కనీసం నీటి తొట్టెలు నిర్మాణం చేసి దాహం తీర్చే పనికాని, ఫీడ్ అందించే పని కాని ప్రభుత్వ అదికార యంత్రాంగం చేపట్టడం లేదు.

పేరుకే పర్యాటక కేంద్రం... పర్యాటకుల తాకిడి శూన్యం

మరవకొత్తపల్లి క్రాస్ వద్ద అలంకార ప్రాయంగా పక్షిబొమ్మలకు రంగు వేయడమే తప్ప వీరాపురంలో అభివృద్ధి చేసింది శూన్యం. ప్రపంచ పర్యాటక కేంద్రంలో ఒకటైన లేపాక్షికి వచ్చే ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా చూడాల్సిన మరో ప్రదేశం వీరాపురం పక్షుల కేంద్రం. గత పదేళ్ల క్రితం పర్యాటకులు అలా వచ్చి పకృతి వడిలో చెట్లపై, చెరువుల్లో పెద్ద పెద్ద రెక్కలతో పొడవాటి కాళ్లతో ఎరుపు పసుపు కలబోసిన పొడగాటి ముక్కుతో కనువిందు చేసే పక్షులను చూసి కాసేపు అలా మైమరచిపోయేవారు. ఆయా గ్రామాలు పర్యాటకుల తాకిడితో నిండిపోయేవి. వీరాపురం గ్రామం ఎప్పుడు వార్తల్లో నిలిచేది. కాని ఇప్పుడు పరిస్థితి అలా లేదు. ఏదైన పకృతి విపత్తు జరిగితేనో లేక కరువు వస్తేనే వార్తాలలో నిలుస్తుంది తప్ప పర్యాటకుల తాకిడి పూర్తిగా తగ్గి పోయింది. కనీస సౌకర్యాలు లేకపోవడం అవసరమైన స్థాయిలో ప్రచారం, ప్రభుత్వ సాయం, ప్రోత్సాహం కల్పించకపోవడం కారణంగా పర్యాటక కేంద్రం కాస్తా సమస్యల కేంద్రంగా మారింది. ఈ గ్రామాల్లో కనీస డ్రైనేజీలు లేక రోడ్డుపైన మురుగునీరు చేరి వెనుకబడ్డ గ్రామాలలో ఉన్నామన్న అనుభూతి పర్యాటకుల్లో పెరిగిపోవడంతో రానురాను పర్యాటకుల తాకిడి తగ్గిపోయింది. ఇప్పుడు పూర్తి స్థాయిలో పర్యాటకుల రాక తగ్గిపోయింది.

గతేడాది పకృతి ప్రకోపానికి, ఈసారి కరువుకు బలైన పక్షులు

గతేడాది అకాల వర్షం, గాలీవాన భీభత్సంతో పదుల సంఖ్యలో పక్షులు మృత్యువాత పడ్డాయి. అనేక పక్షులు అవిటివి అయ్యాయి. అనేక చెట్లు కొమ్మలు విరిగి నేలకొరిగాయి. ఘటన స్థలాన్ని సందర్శించిన అధికారులు ప్రజా ప్రతినిధులు ధూం.. ధాం అన్నారు. ఈ పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసి ఆకాశం అంచున ఉంచుతామని, ఒక పక్షి ప్రాణం పోవడానికి కూడా వీల్లేదని ప్రగల్బాలు పలికారు. కాని ఆరు నెలల కాలంలో కనీసం వీరి సందర్శనలు కూడా లేవు. ఈ ఏడాది కరువు దెబ్బకు వీరాపురం, వెంకటాపురం చెరువుల్లో నీరు పూర్తిగా ఇంకిపోయాయి. పక్షుల రాక పెరిగినా వాటికి కనీస సౌకర్యాలు, వసతి లేకపోవడంతో వెనుతిరిగే పరిస్థితులు నెలకొన్నాయి. మూడేళ్ల క్రితం ఆహారం లేక చెట్ల గూళ్లలో తనువు చాలించిన పక్షుల కళేబరాలు కంటపడ్డ దృశ్యాలు పునారావృతం అవుతాయేమో అని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.

గత ఏడాది గాలీవాన భీబత్సానికి చనిపోయిన విదేశీ పక్షులు(ఫైల్ ఫొటో)

రోడ్డుపక్కన ఆకర్షనీయంగా పక్షి బొమ్మ ఏర్పాటు చేసి రంగులు వేసిన దృశ్యం

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

వీరాపురం పక్షుల కేంద్రం రాను రాను కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో పాలకపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. గతేడాది అతివృష్టి కారణంగా అల్లాడిన విదేశీ పక్షులు ఈ ఏడాది అనావృష్టి కారణంగా ఎలాంటి కష్టాలు పడతాయో. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ముందస్తుగా కనీస అవసరాలైన నీరు, ఆహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలి. చెరువులను నీటితో నింపాలి. లేదా తాత్కాలికంగా తొట్టెలు నిర్మించి చేపలు పెంపకం చేసి పక్షులకు ఆహారం అందజేయాలి. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి.

సుధాకర్,
సిపిఎం నాయకులు

పక్షుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఈ ఏడాది పూర్తి స్థాయిలో చెరువులలో నీరు అడగంటాయి. గత మూడు సంవత్సరాలుగా నీటి సమస్య లేదు. ఇప్పుడు నీటి సమస్య తీవ్రంగా ఉంది. హంద్రీనీవా కాలువ తీసుకొచ్చి చెరువులు నింపుతామని గత 8 ఏళ్లుగా చెబుతూనే ఉన్నారు కాని ఇంత వరుకు ఆ ప్రతిపాదనే లేదు. నీరు లేని కారణంగా పక్షులు సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించి లేఎాక్షి హిందూపురం చెరువులకి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ కూడా నీరు కొద్దిగానే ఉన్నాయి. ఇక నీరు లేక ఆహారం లేక పక్షులు ఈ ఏడాది అల్లాడనున్నాయి. అధికారులు తగిన ఏర్పాట్లు చేసి పక్షులను సంరక్షించే బాధ్యత తీసుకోవాలి

వెంకటేష్,
వెంకటాపురం యువకుడు

బాధితురాలిని పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం...

నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

చంద్రబాబు అరెస్టుతో భావోద్వేగానికి గురై మృతిచెందిన వారి కుటుంబాలకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో అనంతపురం జిల్లాలో భావోద్వేగానికి లోనై మృతిచెందిన వారి కుటుంబాలను భువనేశ్వరి బుధవారం పరామర్శించారు. జిల్లాకు వచ్చిన ఆమెకు టిడిపి అనంతపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి నేతృత్వంలో మరూర్ టోల్‌ప్లాజా వద్ద కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. భారీ కాన్వాయ్ నడుమ అనంతపురం నగారానికి నారా భువనేశ్వరి వచ్చారు. నారా చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు నిజం గెలవాలి కార్యక్రమంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతపురం నియోజకవర్గం 28వ డివిజన్ అశోక్ నగర్‌కు చెందిన డేరంగుల వెంకటమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ. 3 లక్షలు చెక్కును అందించారు. అంతకు మునుపు వెంకటమ్మ చిత్రపటానికి నారా భువనేశ్వరి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ పరంగా అన్ని విధాల కుటుంబాన్ని ఆదుకుంటామని వెంకటమ్మ కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలువ శ్రీనివాసులు, వైకుంఠం విజయలక్ష్మి, తెలుగు మహిళలు స్వప్న, విజయ్ శ్రీ రెడ్డి, సంఘ తేజస్విని, కృష్ణవేణి, సరళ, జానకి, రాధాదేవి, దేవి, దళవాయి మహేశ్వరి, సరోజమ్మ, శరీర, హసీనా, రాములమ్మ,, గౌసియా, వసుంధర, సుజాత, కవిత, రాధ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ....

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుతో మనస్థాపానికి గురై మృతి చెందిన కళ్యాణదుర్గం రూరల్ మండలం, ఎం.కొండాపురం గ్రామంలోని టిడిపి కార్యకర్త దొడ్డి నారాయణప్ప కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. నారాయణప్ప చిత్రపటానికి నివాళులు అర్పించారు. నారాయణప్ప కుటుంబానికి రూ.3 లక్షలు చెక్‌ను అందజేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం రూరల్ మండలం, ముద్దినాయనపల్లి గ్రామంలో పార్టీకార్యకర్త తలారి శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించిన భువనేశ్వరి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.3లక్షలు చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు - 2024పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రవర్తన నియమావళి పరిధిలోకి వస్తారని అన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వడం జరుగుతోందని, వాటిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కలిగి ఉండడం ఎంతో కీలకమని అన్నారు. ఏదైనా సందేహాలు ఉన్నా తమ దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉల్లంఘించ రాదన్నారు. ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ చాలా ముఖ్యమైనదని అన్నారు. ఎన్నికల కోసం సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, సోషల్ మీడియా సెల్, మీడియా మానిటరింగ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, డిసిఒ ప్రభాకర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, వైసిపి ప్రతినిధులు కేవీ రమణ, శ్రీనివాసులు, టిడిపి ప్రతినిధి చెరకుతోట పవన్ కుమార్, బిజెపి ఈశ్వర్ ప్రసాద్, కాంగ్రెస్ ఎంఎండి.ఇమామ్, సర్మాష్ వలి, ఆమ్ ఆద్మీ పార్టీ మసూద్ వలి, బీఎస్పీ అంజయ్య, సిపిఎం ప్రతినిధి బాల రంగయ్య, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ పాల్గొన్నారు.

వేసవి కష్టాలు

- మార్చిలోనే మండుతున్న ఎండలు
- రాష్ట్రంలోనే ‘అనంత’ గరిష్టం
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి మొదలుతోనే అనంతపురం జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు అనంతపురం జిల్లాలో వరుసగా నమోదవుతూ వస్తున్నాయి. ఎండల తీవ్రతను జనం మధ్యాహ్నం సమయాల్లో బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఒక మహిళ వడదెబ్బకు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. హిందూపురం మండలం సడ్లపల్లిలో మంగళవారం రేషన్‌షాపునకు వెళ్లిన ఒక మహిళ వడదెబ్బతో మృత్యువాత పడింది. వేడి తీవ్రత పెరగడంతో వేసవి కష్టాలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల తాగునీటి కష్టాలు రాగా, మరికొన్ని చోట్ల విద్యుత్ కష్టాలు పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలోనే అత్యధికం

ఎండ తీవ్రత రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాలో నమోదయింది. బుధవారం 40.03 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇది రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కంటే అధికంగా ఉండటం గమనార్హం. అంతకు మునుపు ఐదవ తేదీన 39.9 డిగ్రీలు, నాలుగో తేదీన 39.11 డిగ్రీలు ఇలా వరుసగా మూడు రోజులు అనంతపురం జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్న సమయాల్లో వడగాల్పులు సైతం ఉంటుండటంతో రోడ్లపై జనసంచారం తక్కువగా ఉంటోంది. మార్చిలోనే ఈ పరిస్థితులుంటే ఏప్రిల్, మే మాసాలు వచ్చే సరికి మరింత తీవ్రమవుతాయేమోనని జనం భయపడిపోతున్నారు. వేసవిలో శీతాలాన్ని అందించే ఎసిలు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లకు గిరాకీ పెరిగింది. అన్ని ఎలక్ట్రానిక్ షాపుల్లోనూ వీటి కొనుగోళ్లు సాధారణం కంటే పెరిగాయి.

వేసవి కష్టాలు మొదలు

వేసవి కాలం మొదలయిందో లేదో కరెంటు కష్టాలు మొదలయ్యాయి. ప్రధానంగా వ్యవసాయరంగానికికోతలు పెరుగుతున్నాయి. రోజుకు తొమ్మిది గంటల విద్యుత్ అని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో ఇప్పుడు ఏడు గంటలకు వచ్చేసింది. 2023 వర్షాభావానికి తోడు విద్యుత్ సమస్య పెరగడంతో పంటలను రక్షించుకునేందుకు రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ కోతలపై నిరసనలు సైతం చేపడుతున్నారు. ఇక తాగునీటి కష్టాలు పెరుగుతున్నాయి. సత్యసాయి జిల్లాలో సుమారు వందకుపైగా గ్రామాల్లో ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో గుత్తి, కళ్యాణదుర్గం ప్రాంతాల్లోనూ తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసనలు చేపట్టారు. ప్రారంభంలోనే ఈ పరిస్థితులుంటే వచ్చే ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్రమవుతాయన్న ఆందోళన ప్రజల్లో ఉంది.

యువత రాజకీయాల్లో రాణించాలి

జెఎన్‌టియు విసి జి.వి.ఆర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

నేటి యువతీ, యువకులు వృత్తిపరమైన విద్యలోనే కాకుండా రాజకీయాల్లో అడుగుపెట్టి రాణించాలని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం, భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, జెఎన్‌టియు అనంతపురం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ‘జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్’అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలను వెలకితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యూత్ పార్లమెంట్‌లో భాగంగా వికసిత్ భారత్, ఆత్మ నిర్భర్ భారత్, ఎసియన్ గేమ్స్ లో భారత్ సాధించిన పతకాలు. విదేశాంగ విధానం, ఇండియా ఏ 2047 లో అతి పెద్ద అర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా అవతరించనున్న భారతదేశం, అర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, చంద్రయాన్, భారతరత్న అవార్డులు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, అడిషనల్ ఎస్పీ మల్లికార్జునవర్మ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, ఎంబిఎ విభాగ అధిపతి టి.నారాయణరెడ్డి, ఎన్‌వైకె ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, జారి మెంబర్, జువాలజీ లెక్చరర్ జిఎల్ఎన్ ప్రసాద్, ఓ.ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, జయమారుతి, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి వరలక్ష్మి, రిటైర్డ్ ప్రిన్సిపల్ పి.రమేష్‌నారాయణ, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, యువకులు పాల్గొన్నారు.

544-డి రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

544-డి రోడ్డు నిర్మాణంలో భూములు, ఇల్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, పండ్లతోటల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివారెడ్డి మాట్లాడుతూ 544-డి రోడ్డు ఏర్పాటు నేపథ్యంలో రోటరీపురం నుంచి నాయనిపల్లి, ముచ్చుకోట, ఎల్అండ్‌టి బుగ్గ వరకూ500 ఇళ్ల పోతున్నాయని తెలిపారు. పాముదాయి నుంచి గుంటూరు వరకూ 417 కిలోమీటర్లులో భాగంగా భోగసముద్రం వరకూ 69 కిలోమీటర్లు రెండు భాగాలుగా టెండర్లు వేశారని తెలిపారు. 65 ఎకరాల భూమి 500 ఇళ్లు 14 గ్రామాల్లో రోడ్డు ఇరువైపులా పోతున్నాయని ఆ భూములకు సంబంధించి అనేకసార్లు చర్చలు జరిపి డబ్బులు వేసి, ఒక సంవత్సరం గడిచిందన్నారు. పనులు ప్రారంభించారని, ఆ తర్వాత ఇళ్లకు ఎస్టిమేషన్ వేసి, అమౌంట్ నిర్ణయించి, సంవత్సరం అవుతున్నా, ఇంత వరకూ చాలా మందికి అకౌంట్లలో డబ్బులు వేయలేదన్నారు. ముందుగా నిర్వాసితులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇంటిపట్టాలు జగనన్న గృహవసతి కింద ఇళ్లు కట్టించాలన్నారు. ప్రభుత్వ ఆ దిశగా పని చేయడం లేదన్నారు. ఏమైనా సమస్యలు వుంటే పరిష్కరించి, వెంటనే డబ్బులు వారి అకౌంట్లలో వేయాలన్నారు. లేనిపక్షంలో పనులు అడ్డుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఆర్.కుళ్లాయప్ప, మండల నాయకులు సంజీవరెడ్డి, వెంకట్ కొండ, షరీఫ్, లక్ష్మీనారాయణ, షామీర్, ముచ్చుకోట గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం ముందు రైతుసంఘం నాయకులు

కలిసికట్టుగా పని చేసి వైసిపిని గెలిపించుకుందాం

ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

విపక్షకు తావులేకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ, అభివృద్ధి పాలనను కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని అందరం కలిసికట్టుగా తిరిగి గెలిపించుకుందామని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, పార్లమెంటు సమన్వయకర్త శంకరనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం'లో భాగంగా బూత్ ప్రెసిడెంట్లతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా బూత్‌లను ఎలా సిద్ధం చేయాలి, బలోపేతం చేయడానికి విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా, ఏ ఇంటికి వెళ్లినా జగనన్న అందించిన సంక్షేమమే కనిపిస్తుందన్నారు. విశ్వసనీయతతో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని పెత్తందార్ల కూటమిని ప్రజలు నమ్మవద్దన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను ఎన్నుకోవాలని, పిల్లల భవిష్యత్తు కోసం జగనన్నను మాత్రమే నమ్మాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, నాయకులు, బూత్ ప్రెసిడెంట్లు, బూత్ వైస్ ప్రెసిడెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని డిక్లరేషన్లు ప్రకటించినా టిడిపి ఓటమి ఖాయం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి అధినేత చంద్రబాబు ఎన్ని డిక్లరేషన్లు ప్రకటించినా వారికి ఓటమి ఖాయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని 2వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా పని చేసి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందివ్వలేని దౌర్భాగ్య వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక శాచ్యులేషన్ పద్ధతిలో అర్హత ఉంటే చాలు పింఛన్లు అందించారని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా చంద్రబాబు బీసీ డిక్లరేషన్ పేరుతో మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఆయన్ను ఏవర్గం కూడా నమ్మే పరిస్థితి లేదన్నారు. సిఎం జగన్ బాధ్యతలు చేపట్టి కేవలం 4 ఏళ్ల 10 నెలలు మాత్రమే అయిందన్నారు. ఈమధ్యకాలంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని నేరుగా అందజేస్తున్నారన్నారు. ఇది జీర్ణించుకోలేని టిడిపి, జనసేన నాయకులు ప్రజల వద్దకు వచ్చి లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారన్నారు. వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా వైసిపికి ఓటు వేసి సంక్షేమ పథకాలు కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

'టిడిపితోనే బిసిల అభ్యున్నతి'

ప్రజాశక్తి-ఆత్మకూరు

టిడిపితోనే బిసిల అభ్యున్నతి సాధ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు తెలిపారు. టిడిపి, జనసేనల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కలిసి బిసి డిక్లరేషన్ ప్రకటించడాన్ని హర్షిస్తూ బుధవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు లబ్ధి చేకూరే విధంగా 50ఏళ్లకు రూ.4వేల పింఛన్, చంద్రన్న బీమా పునరుద్ధరణ, చంద్రన్న బీమాను రూ.10 లక్షలకు పెంచడం, పెళ్లికానుక రూ.లక్షకు పెంపు, చట్టబద్ధంగా కుల గణన, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు, ప్రత్యేక బిసి రక్షణ చట్టం వంటివి తీసుకొస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోరంజని, వెంకటనారాయణ, బెస్త తిమ్మరాయుడు, తిక్కస్వామి, నారాయణ, రాము, అక్కులన్న, దాసు, కార్తీక్, పూల పత్తి, అనిల్, లక్ష్మీదేవి, చెన్నమ్మ, నాయకులు బాబా, మల్లన్న, ఉష, జగదీష్, గాలి నరసింహులు, కుర్లపల్లి ఈశ్వరయ్య, హరి, సుధాకర్, చిట్టమ్మ, కాయగూర లక్ష్మీదేవి, మనోహర, పోతన్న, గుజ్జాల వెంకటేశు, ముట్టాల నరసింహులు, చంద్ర, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

'బీసీల గురించి మాట్లాడే అర్హత 'బాబు'కు లేదు'

సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

అధికారంలో ఉన్నప్పుడు బిసిలను పూర్తిగా విస్మరించిన చంద్రబాబు ఇప్పుడు బిసిల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అనంతపురం ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అరకొర పనిముట్లు అందజేసి కమీషన్ రూపంలో కోట్లు దండుకున్నాడని ఆరోపించారు. ప్రస్తుతం సిఎం జగన్ కేబినెట్‌లో 25 మంది మంత్రులుంటే, వీరిలో 12 మంది బిసిలు ఉన్నారన్నారు. వీటికితోడు మేయర్లు, జెడ్పీ ఛైర్మన్లు, ఎంపీపీలు, కార్పొరేషన్ ఛైర్మన్ల పోస్టుల్లో బిసిలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అంతేగాకుండా స్థానిక ఎన్నికల్లో 34 శాతం శాతం రిజర్వేషన్లు కల్పించి బిసిలకు గుర్తింపు ఇచ్చారన్నారు. అలాంటి సిఎం జగన్‌పై చంద్రబాబు లేనిపోని ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బిసిలు టిడిపి ట్రాప్‌లో పడొద్దని సూచించారు. ఈ సమావేశంలో ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు, జోనల్ ఇన్‌ఛార్జి రమేష్‌గౌడ్, కార్పొరేటర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పిసిసి అధికార ప్రతినిధిగా రామానాయుడు

ప్రజాశక్తి-ఉరవకొండ

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొడపాటి రామానాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామానాయుడు మాట్లాడుతూ అధికార ప్రతినిధిగా తనకు అవకాశం కల్పించిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్, మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, మాజీ పిసిసి శైలజానాథ్, డిసిసి అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాపరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లాస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోసా రాము, ఎపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రేగటి చెన్నప్ప, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి అబ్బాస్, కార్యదర్శి సోనియా సీన, వజ్రకరూరు, కూడేరు, విడపనకల్లు మండలాల ఇన్‌ఛార్జిలు కన్నీరప్ప, కొండకిందు శ్రీకాంత్‌రెడ్డి, నారాయణ స్వామియాదవ్, రాముడు, నాయకులు హిదాయత్ ఖాన్, డి.రవి, హనుమంతు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

ప్రజాశక్తి-బెలుగుప్ప

పరిపాలన చేతకాని జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పయ్యావుల కేశవ్ సోదరుడు శ్రీనివాసులు, కేశవ్ తనయుడు విజయసింహా అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామనేపల్లి, బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లి తండా గ్రామాల్లో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో ఉరవకొండలో పయ్యావుల కేశవ్‌ను, చంద్రబాబును గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం రామనేపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి

హైదరాబాదు పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

నేటి బాలల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 7వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా విద్యాపరంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి సాధ్యమన్నారు. కావున విద్యార్థి కష్టపడి చదివితే ఎంతస్థాయికైనా ఎదగొచ్చన్నారు. ఇందుకు ఉదాహరణ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు. ఆయన చెప్పినట్లు 'కల కని.. సాకారం చేసుకో' అన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ ఎంతైనా అవసరమని విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి చెందాలన్నా ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్య చాలా ప్రధానమన్నారు. అన్నింటికీ మూలం విద్య అన్నారు. కావున ప్రతి ఒక్కరూ విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ ప్రతాపరెడ్డి, జెఎసి రామసుబ్బారెడ్డి, ఎఐఎస్ శంకరనారాయణ, ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ఎన్నికల ఆర్ఓ కరుణకుమారి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఓ కరుణకుమారి

ప్రజాశక్తి-రాయదుర్గం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఆర్ఓ ఆఫీసర్ కరుణకుమారి సూచించారు. బుధవారం రాయదుర్గంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, సెక్టార్ అధికారులు, బిఎల్వోలు, పోలీసు అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు ఇచ్చిన జాబితా మేరకు గత ఎన్నికల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో 108 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. చౌక దుకాణపు డీలర్లు, వార్డు వాలంటీర్లు, మెప్మా రీసోర్స్‌పర్సన్‌లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీ నాయకుల వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదన్నారు. ఈ సమావేశంలో ఐదు మండలాల తహశీల్దార్లు, రాయదుర్గం మున్సిపల్ కమిషనర్, డిఎస్‌పి, పోలీస్ ఇన్స్‌పెక్టర్లు, బిఎల్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంలో ఆదర్శంగా ఉండాలి

రాయదుర్గం రూరల్ : ఓటుహక్కును వినియోగించుకోవడంలో యువత ఆదర్శంగా ఉండాలని రాయదుర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కరుణకుమారి సూచించారు. బుధవారం స్థానిక కెజిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథక విభాగం, రెవెన్యూ శాఖ సంయుక్తంగా ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ముందు విషయాలను విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడం, నిర్భయంగా వచ్చి ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవడం, నిజాయితీగా ఓటు వేయడం తప్పకుండా పాటించాలన్నారు. యువతను మేల్కొలపడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు వీడియోలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘు రామమూర్తి, వైఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకృష్ణ, నాగప్ప, అధ్యాపకులు బాబు, రాధాకృష్ణ, వినోద్, దేవదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లాబకాష్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా తాగునీటిపై దృష్టి సారించాలని ఎంపిడిఒ అల్లాబకాష్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి విద్యావతి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యం పనులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే పారిశుధ్య కార్మికులకు వేతనాలు, విద్యుత్ బిల్లులు చెల్లించే స్థాయిలో పంచాయతీ స్థాయిలోనే ఇఒఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు చూడాలన్నారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి రంగనాయకులు, సర్పంచులు విశ్వనాథ్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, ఎంపిటిసిలు, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఆజాద్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారిణి ఓబుళమ్మ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు, నీటిట్యాంకుల మరమ్మతులు చేపట్టాలన్నారు. పంచాయతీల్లో ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ రామలింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఆలం'కు అభినందనలు

ఆలం నరసానాయుడును అభినందిస్తున్న నాయకులు

నార్పల : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సీనియర్ నాయకులు ఆలం నరసానాయుడును నియమించడం పట్ల పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి భారీగా చేరుకుని బొకేలు అందజేసి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలం నరసానాయుడు మాట్లాడుతూ తనకి పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును 2024లో ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. అభినందించిన వారిలో మాజీ జడ్పిటిసి గుగూడు జాఫర్‌వలి, తెలుగు యువత నాయకులు చంద్రబాబు, మురళీధర్, తదితరులు ఉన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

గుత్తి : ఈనెల 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాసమితి అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి బి.సాధుబాబు తెలిపారు. బుధవారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలతో కక్షిదారుల కేసులు అధిక శాతం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి, జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.దీప్తి, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మనోహర్‌బాబు, సీనియర్ న్యాయవాదులు జి.వెంకటరెడ్డి పీవీ.ప్రతాపరెడ్డి, న్యాయవాదులు జాకీర్ హుస్సేన్, ఆర్‌వి.చలపతి, వీసీ. గంగాధర్ కుమార్, ధనంజయ, మహమ్మద్ రసూల్, నూర్ మహమ్మద్, ఫక్రు బాషా, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

రాయదుర్గం : పట్టణంలోని 9వ వార్డు, 1వ వార్డులో సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకున్న ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, నాయకులు అరవా శివప్ప, వలిబాషా, గోవిందరాజులు, అజయ్‌కుమార్, గోవిందా, ఫక్రుద్దీన్, సంజీవ, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యులు నజీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మేకల శ్రీనివాసులు, వైకాపా నాయకులు శివ, శర్మాస్, నిజాం, దివాకర్, శ్రీరామిరెడ్డి, బషీర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

శింగనమల : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని చిన్న కాలువ వీధిలో ఉన్న భవానీ శంకర ఆలయంలో అన్నదానానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు బుధవారం రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురాం, బెస్త నారాయణస్వామి, కాయల సురేష్‌యాదవ్, దేరంగుల శంకరయ్య, మహమ్మద్ గౌస్, నాగేశ్వరరెడ్డి, దాసరి వెంకటరమణ, రాజాబాబు, జడేజా, శంకర్‌నారాయణ, ప్రసాద్‌నాయక్, డి.నాగేంద్ర, నల్లప్ప, శీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

ధర్నా చేస్తున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల పరిధిలోని పెనకచర్ల గ్రామం డ్యాం కెనరా బ్యాంకు అధికారులు రైతు రుణాల షెడ్యూల్ ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేయడం తగదని సిపిఎం నాయకులు అన్నారు. బుధవారం కెనరా బ్యాంకు ముందు సిపిఎం, రైతుసంఘా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ రైతులకు రుణాలు ఇవ్వమంటే బ్యాంకు అధికారులు సర్వర్ రాలేదని చెబుతూ బ్యాంకు చుట్టూ తిప్పుకోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా రైతులకు రుణాలివ్వడంపై బ్యాంకు అధికారులు అలసత్వం వహిస్తున్నారన్నారు. వెంటనే రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండి రాముడు, నల్లప్ప, ఓబులేసు, రైతులు పాల్గొన్నారు.

వికలాంగుల మహాగర్జనను విజయవంతం చేద్దాం

ఉరవకొండ : వికలాంగుల సమస్యల సాధన కోసం ఈనెల 9న అమరావతిలో తలపెట్టిన వికలాంగుల మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కదిరప్ప పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద ఎంఆర్‌పిఎస్, వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహాగర్జనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కేంగూరి.ఎర్రిస్వామి, నియోజకవర్గ నాయకులు యల్లన్న, అల్లెప్ప, రేణుమాకులపల్లి రమేష్, వికలాంగుల మండల సమైక్య సెక్రటరీ చంద్రమౌళినాయక్, చైతన్య వికలాంగుల సేవాసంఘం అధ్యక్షులు నాగేంద్ర, నాయకులు అమిద్, రషీద్, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

బెలుగుప్ప: పదవ తరగతి విద్యార్థులు త్వరలో జరిగే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మంచి మార్కులు సాధించాలని సుజలాన్ కంపెనీ అధినేత వెంకటరమణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుజలాన్ కంపెనీ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. అలాగే 8, 9వ తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : ఎంపీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న తలారి రంగయ్య

కుందుర్పి : ప్రతి కార్యకర్త వైసిపి గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమల నాగరాజు, నాయకులు సత్యనారాయణశాస్త్రి, రాధాస్వామి, సుదర్శన్‌రెడ్డి, రాము, వన్నూరు రెడ్డి, పాలాక్షి, శ్రీలక్ష్మి అజయ్‌బాబు, భీమిరెడ్డి, ముజీవుల్లా, లింగప్ప, మారుతీశ్వరి రామమూర్తి, జగన్, గంగాధర, ప్రభాకర్‌రెడ్డి, లలితమ్మ బొమ్మయ్య, హస్నాబీ అతావుల్లా, మమతా ధనుంజయ, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా కీలక భూమిక పోషించాలి

అనంతపురం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మీడియా కీలకభూమిక పోషించాలని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సార్వత్రిక ఎన్నికలు-2024పై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో మీడియా పాత్ర అత్యంత ముఖ్యమైందన్నారు. ఎన్నికల కోడ్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉందని, రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో పాత్రికేయులు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఎన్నికల కమీషన్ నియమ నిబంధనలను పాటించేలా మీడియా ప్రధాన భూమిక వహించాలన్నారు. ముఖ్యంగా పెయిడ్ న్యూస్‌కి సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి కొన్ని సూచనలు ఉన్నాయని, ఇందుకోసం ఎంసిఎంసి (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) ఉంటుందని, నోడల్ అధికారి ఉంటారని, కమిటీ సర్టిఫికేషన్ జరిగిన అనంతరం నిర్ణయించిన డిఐపిఆర్‌ఓ రేట్స్‌కు అనుగుణంగా పెయిడ్ న్యూస్ ప్రచురించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ అండ్‌పీ ఆర్ డిఐపిఆర్‌ఓ గురుస్వామిశెట్టి, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో 13మందికి గాయాలు

ఉరవకొండ : ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో 13 మందికి గాయాలైన ఘటన బుధవారం ఉరవకొండ మార్కెట్ యార్డు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వజ్రకరూరు మండలం పందికుంట గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఊరిలో నూతన గృహప్రవేశానికి వెళ్లి వస్తుండగా ఉరవకొండ పట్టణ శివారులోని మార్కెట్ యార్డు వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో 13 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తన వాహనాన్ని పక్కన ఆపివేసి గన్‌మెన్, పిఎ సహాయంతో క్షతగాత్రులందరినీ ప్రయివేటు వాహనాల్లో ఆసుపత్రికి తరలించారు. తర్వాత ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులందరికీ అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలు అందించి మెరుగైన చికిత్స ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పోలీస్ అధికారులతో మాట్లాడారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఇద్దరిని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రేషన్‌బియ్యం పట్టివేత

బొమ్మనహాల్ : మండలంలోని బండూరు గ్రామం నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బండూరు నుంచి దాదాపు 60 బస్తాల రేషన్ బియ్యాన్ని కర్నాటకకు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచి సిబ్బంది దాడి చేసి ఉద్దేహాల్ వద్ద పట్టుకుని తమకు అప్పగించినట్లు తెలిపారు. బియ్యంతోపాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసు సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష

అనంతపురం క్రైం : జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై బుధవార ం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సమీక్షిం చారు. ఇందులో భాగంగా పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల కోసం సంక్షేమ కార్యక్రమాలపై పోలీసు అధికారులు, స్పెషల్ బ్రాంచి అధికారులు, పోలీసు వెల్ఫేర్ కమిటీ, అసోసియేషన్ సభ్యులతో చర్చించారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌బి సిఐలు జాకీర్‌హుస్సేన్, ఇందిరా, ఆర్ఐలు రాముడు, రెడ్డెప్పరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

బెలుగుప్ప: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్‌డిటి సంస్థ తరుపున రూ.50వేల విలువజేసే క్రీడాసామగ్రిని అందజేశారు. అనంతరం క్రికెట్ నెట్ ప్రాక్టీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ ద్వారా విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేయడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పి.మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటప్రసాద్, ఆత్మకూరు ఎటిఎల్ సురేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం విడుదల

పుట్లూరు : ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం విడుదల చేసినట్లు ఎఒ కాత్యాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ 2023లో మండలంలో పంటలు సాగు చేసి నష్టపోయిన 1,449 మంది రైతులకు 1365.3 హెక్టార్లకుగాను రూ.1.67 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

పరిశోధక విద్యార్థి పుస్తకావిష్కరణ

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ పరిశోధక విద్యార్థి వై.నాగేందర్‌రెడ్డి రచించిన 'సాటిస్ఫాక్షన్ ఇన్ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్' అనే పుస్తకాన్ని బుధవారం తన ఛాంబర్‌లో ఉపకులపతి కె.హుసేన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధక విద్యార్థిగా ఉంటున్న వై.నాగేందర్‌రెడ్డి లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ లో వినియోగదారుల సంతృప్తిపై పుస్తకం రచించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌కెయు రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రిన్సిపల్ కృష్ణకుమారి, హంపాపురం మోదుపల్లి ఆదినారాయణ, ఎస్‌కెయు మల్లిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుత్తి : పట్టణంలోని గాంధీ కూడలిలో వైఎస్ఈఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి వైఎస్ఈఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సొసైటీ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఈఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకుడు అరుణ్‌కుమార్, బలిజ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బండి సత్యనారాయణ, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుందాం'

శింగనమల : ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుందామని మండల టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వర్గవిబేధాలను పక్కన పెట్టి నియోజకవర్గం నుంచి బండారు శ్రావణిశ్రీని భారీ మెజారిటీతో గెలిపించి చంద్రబాబుకు బహుమతి ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి వెంకటనారాయణ, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

యువ చైతన్యయాత్రకు విశేష స్పందన

తాడిపత్రిరూరల్ : మండల పరిధిలోని తేరన్నపల్లి, తిమ్మాపురం, ఎగువపల్లి, దిగువపల్లి గ్రామాల్లో బుధవారం రెండోరోజు జెసి ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన యువచైతన్య బస్సుయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో జేసీకి మహిళలు, యువకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజల సమస్యల గురించి ఆరాతీశారు. అనంతరం టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటు వేసి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

ఉరవకొండ : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ తెలిపారు. బుధవారం ఉరవకొండలోని ఆర్ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,22,723 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందుకోసం నియోజకవర్గవ్యాప్తంగా 263 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టామన్నారు.

వృద్ధుడికి వైద్యం

ఉరవకొండ : పెయింట్ పనుల నిమ్మితం ఉరవకొండకు వలస వచ్చిన కర్నాటకకు చెందిన రాజ (65) స్థానిక కరిబసవ స్వామి మఠం వద్ద కదలలేని పరిస్థితిలో ఉండగా ఆపద్భాందవ ట్రస్టు సభ్యులు వైద్యం అందించారు. రాజ నిస్సహాయ స్థితిలో ఉన్న విషయం గమనించిన స్థానికులు ట్రస్టు సభ్యులకు సమాచారం ఇవ్వగా వెంటనే వారు వచ్చి ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు.

వృద్ధుడిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న ఆపద్భాందవ ట్రస్టు సభ్యులు